


www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 26 | అక్టోబర్ | 2025 పేజీలు : 8

# బలహీనపడుతున్న బంధాలు..!



## -విడివడుతున్న కుటుంబాలు -పెరుగుతున్న దారుణాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** బంధాలు బలంగా ఉంటే బలమైన సమాజం రూపుదిద్దుకుంటుంది. ఒకప్పుడు కుటుంబ వ్యవస్థతో పాటు మనుషుల మధ్య బంధాలు స్నేహబంధం, రక్త బంధం ఇలా అన్ని బంధాలు బాగుండటంతో పాటు నమ్మిన వారిని మోసం చేయరాదన్న సూక్తిని నిరంతరం మననం చేసుకునే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. మనుషుల మధ్య సంబంధాలన్ని ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయి. దీనితో కుటుంబ వ్యవస్థ విచ్చిన్నమవుతుంది. ఉమ్మడి కుటుంబాల జాడ లేకపోగా కుటుంబంలో ఉన్న ఆలుమగల మధ్య సఖ్యత ఉండటం లేదు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరిగి సృష్టికి ప్రతి సృష్టి జరుగుతున్న వేళ దగ్గరగా ఉండే ఇద్దరి మనసుల మధ్య దూరం పెరిగిపోతున్నాయి. ఒకరినొకరు అర్థం చేసుకోవటం, సఖ్యత కోసం కాస్తా రాజీపడాలన్న ఆలోచన మచ్చుకు కూడా ఉండటం లేదు. నేనుందుకు రాజీ పడాలి అన్న ప్రశ్న తప్ప మరో సమాధానం దొరకని యువ జంటలు మన ముందు సాక్ష్యత్కరిస్తున్నాయి. ఆ పెడ ధోరణి నూరేళ్లు సాగాల్సిన వివాహ బంధాన్ని సంవత్సరాలు కాదు నెలలకు పరిమితం చేస్తూ టివి ఎక్కువగా చూడటం, తనకు నచ్చని డ్రెస్ వేసుకోవటం, వద్దు అన్నవి తినటం, ఫోన్‌లో మాట్లాడటం కూడా విడాకులకు కారణమవుతున్నాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. విడాకులకు దరఖాస్తు చేసిన జంటలు చెబుతున్న కారణాలు విని సీనియర్ న్యాయవాదులే విస్తుపోతున్నారు. ఒకప్పుడు విడాకులు తీసుకోవడమంటే ఏదో ఒక తప్పిదంగా భావించి న్యాయస్థానానికి చేరిన తర్వాత ఒకరినొకరు తమ తమ తప్పిదాలను తెలుసుకుని తిరిగి వైవాహిక జీవితాన్ని ఆనందంగా గడిపిన ఘటనలు చాలా ఉన్నాయి. కాని ఇప్పుడు విడాకులు తీసుకోవటం స్టేటస్ సింబల్‌గా భావించే రోజులు వచ్చాయి. చాలా సంవత్సరాలు కుటుంబ జీవితాన్ని, పిల్లలు పెద్దవాళ్లయిన తర్వాత కూడా విడిపోవాలనుకుంటున్నారంటే

మిగతా 2లో..

## ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య
# వారధిగా ప్రజాపక్షం



## -ప్రజా సమస్యలను వెలికితీయండి
## -వార్షికోత్సవ సభలో బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య 'ప్రజాపక్షం' దినపత్రిక వారధిగా పని చేయాలని నవచేతన గవర్నింగ్ బాడీ సభ్యులు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రజల దరి చేరేటట్లు చూడడంతో పాటు ప్రజాసమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు పోవాలన్నారు. 'ప్రజాపక్షం' దినపత్రిక ఏడవ వార్షికోత్సవ సభ శనివారం ఖమ్మంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ప్రజాపక్షం విలేకరులు, పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ సమాజంలో మీడియా ఒక కీలక భూమిక పోషించాలని ఆయన కోరారు. మీడియాలో సైతం పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఇటువంటి సమయంలో నిబద్ధతకు నిలువుటద్దంలా ప్రజాపక్షం నిలబడటం అభినందనీయమన్నారు. ప్రతి అక్షరం ప్రజల పక్షమేనని ఏడు సంవత్సరాలుగా ప్రజాపక్షం రుజువు చేసుకుంటుందన్నారు. భవిష్యత్తులో సైతం ఇదే పంథాను కొనసాగించాలని హేమంతరావు కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొంత మంది అర్హులకు

మిగతా 2లో..

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
7వ వార్షికోత్సవ శుభాకాంక్షలతో
ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, ఖమ్మం
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, ఖమ్మం
ఔషధ నియంత్రణ కార్యాలయం, ఖమ్మం
దుర్గా విరించి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, NST రోడ్, ఖమ్మం
ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్‌లు, ఖమ్మం
తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం (RMPWA-TS)

# బలహీనపడుతున్న బంధాలు..!



(మొదటిపేజీ తరువాయి)

వారి వైవాహిక జీవితం అంత బలంగా లేదనే అర్థం చేసుకోవాలి. ఒకరి కోసం ఒకరు అన్న భావన స్థానే నేను నా సుఖం అన్న భావన ఏర్పడింది. అదే శారీరక, వైవాహిక, స్నేహ, రక్త బంధాలను తెంచేస్తుంది. ఇప్పుడు వివాహేతర సంబంధాలు, వాటి నేపథ్యంలో జరుగుతున్న హత్యలు చర్చకు దారి తీయటం కాదు భయం గొల్పుతున్నాయి. వారం రోజులుగా చోటు చేసుకున్న కొన్ని ఘటనలు పరిశీలిస్తే మనం ఎక్కడున్నాం, ఏమిటి దారుణం అనుకొక తప్పదు. ఫోన్‌లో సరిగ్గా సమాధానం ఇవ్వలేదని ఇద్దరు పిల్లలను హతమార్చి తాను ఆత్మహత్య చేసుకుంది ఓ ఇల్లాలు. ఫోన్‌లో సరిగ్గా స్పందించకపోవటం ఒక్కటే కారణం కాకపోవచ్చు కాని జరిగింది దారుణం. 17 సంవత్సరాల వయస్సు గల పిల్లలున్న ఓ ఇల్లాలు వేరే వ్యక్తితో అక్రమ సంబంధం ఏర్పరచుకోవటంతో పాటు ప్రియునితో కలిసి భర్తనే హతమార్చింది. ఇక భార్య వేధించటం, హతమార్చటం ప్రతి రోజు ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. అక్రమ సంబంధం నేపథ్యంలోనే ఆటోలో వెళ్తున్న ఓ మహిళను దారుణంగా నరికి చంపారు. కొందరి విషయంలో అత్తారింటికి దారేది సినిమాలో పవన్ కళ్యాణ్ మాటలను గుర్తుకు తెస్తాయి. అపురూపంగా ఆడపిల్లలను పెంచుతారు చివరికి ఏ శాడిస్టుకో ఇచ్చి కట్టబెడతారు అన్నట్లు లక్షల్లో సంపాదన ఏ బాదర బంధి లేని జీవితమైనా భార్యను సరిగ్గా చూసుకోలేని కురచ మనస్థత్వం. వివాహ సంబంధాలు ఇలా ఉంటే రక్త బంధాల పరిస్థితి మరి దారుణం. ఆస్తి కోసం అన్నను చంపిన తమ్ముడు, తండ్రిని గొడ్డలితో నరికి చంపిన కొడుకు, ఆస్తి కోసం అన్నదమ్ముల మధ్య ఘర్షణ దాడిలో తమ్ముడి మృతి ఇటువంటి వార్తలు నిత్యకృత్యమవుతున్నాయి. స్నేహబంధాల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. స్నేహితునికే టోకరా, స్నేహం పేరుతో వంచన అన్నవి వింటూనే ఉన్నాము. సమాజంలో మార్పులు వచ్చాయి. అధునీక సమాజ నిర్మాణం జరుగుతుందని ఆనందం ఒక పక్క, మనుషుల మధ్య ఆర్థిక సంబంధాలు తప్ప మరో సంబంధం లేదన్న ఆవేదన మరో పక్క వ్యక్తమవుతున్నాయి. మనుషుల మధ్య బంధాలు లేని సమాజంలో మార్పులు తప్ప మరేమి ఉంటాయి. కుటుంబాల మధ్య, కుటుంబంలోని సభ్యుల మధ్య ఆత్మీయ బంధాలకు మళ్లి అంకురార్పణ జరగాలి. బలమైన బంధం భవిష్యత్ తరాలకు అందెలా ఆలోచన సాగాలి. లేదంటే ఒక వికృత, హింసాత్మక ధోరణి కలిగిన సమాజం మనకు మిగులుతుంది.

# ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా 'ప్రజాపక్షం'



(మొదటిపేజీ తరువాయి)

అందడం లేదని దీనిని ఎజెండాగా తీసుకుని సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రజాపక్షం దన్నుగా నిలవాలని ఆయన కోరారు. మీడియాపై పలు విమర్శలు వ్యక్తమవుతున్న నేటితరుణంలో ప్రజాపక్షం కుటుంబం విమర్శలకు తావివ్వకుండా ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక శ్రామిక జనవాణిగా నిలబడిందని వార్షికోత్సవ సందర్భంగా ఇందుకు కారకులైన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని, ఇదే ఒరవడిని మున్ముందు కూడా కొనసాగించాలని ఆయన కోరారు. సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్పొరేటర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, ఖానాపురం హవేలీ ఏరియా సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ, ప్రజాపక్షం ఎడివిటి ఇంచార్జి టికె ప్రసన్నన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాప్ రిపోర్టర్ పి. సత్యనందబాబు, ఆర్‌సి ఇంచార్జీలు కె. ప్రసాదరావు, వి. నాగేశ్వరారవు, కె. శ్రీనివాసరావు, బి. అశోక్, శ్రీకాంత్, పలువురు సీనియర్ జర్నలిస్టులతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాపక్షం మండల రిపోర్టర్లు, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా లింగాల కమల్‌రాజు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** ఖమ్మం జిల్లా పరిషత్ మాజీచైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు జన్మదిన వేడుకలను మధిర పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మండల పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లింగాల కమల్‌రాజు మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, రాజకీయంలో ఉన్నత పదవులు అలంకరించి ఈ ప్రాంత ప్రజలకు తమ సేవలను అందించాలని ఆకాంక్షించారు. అనంతరం దిగుడుపాడులోని ఆదరణ సేవా పౌండేషన్ ఆశ్రమంలో జన్మదిన వేడుకలు జరిపి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, యన్నంశెట్టి అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, కటికల సత్యనారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్వరం పాఠశాలకు రాష్ట్రస్థాయి అవార్డు




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని గణేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలకు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. రాష్ట్ర స్థాయిలో గణేశ్వరం పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం అత్యధికంగా ఉన్నందున రాష్ట్ర స్థాయి అవార్డును ప్రదానం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ నుండి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. విజయశ్రీ అవార్డును అందుకున్నారు. అవార్డు ప్రధానోత్సవంలో అడిషనల్ ప్రాజెక్టు హెడ్ రాధారెడ్డి, సెక్రటరీ రమేష్, ఆర్‌జెడిలు సత్యనారాయణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అత్యధిక హాజరు శాతం ఉన్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలితో పాటు ఉపాధ్యాయుల కృషిని ప్రత్యేకంగా అభినందించారు. 95 శాతానికి పైగా హాజరు నమోదైనందుకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్బంగా మండల విద్యాధికారి బి. రాములు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో అత్యధిక విద్యార్థుల హాజరు నమోదులో గణేశ్వరం పాఠశాల నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. దీనికి కృషి చేసిన హెచ్‌ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు రఫీక్‌పాషా, గోపాలరావు, మజ్‌హర్, వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి తదితరులను అభినందించారు. ఉపాధ్యాయుల బోధన పట్ల విద్యార్థులు ఆకర్షితులై ప్రతి రోజు పాఠశాలకు వచ్చేందుకు ఆసక్తి చూపడం వల్లే ఈ అవార్డు రావడానికి ప్రధాన కారణమని ఎంఈవో తెలిపారు. హెచ్‌ఎం విజయశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో అవార్డు రావడం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలపై నమ్మకంతో తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపడం వల్లే ఈ అవార్డుకు కారణమన్నారు. తమపై మరింత బాధ్యత పెరిగిందని ఆమె తెలిపారు. తోటి ఉపాధ్యాయులతో సహకారం అందించిన తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా నాగుల చవితి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో నాగుల చవితి పండుగ సందర్భంగా భక్తులు శనివారం పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను తీర్చుకొని నాగదేవతను పూజించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు నూతన వస్త్రాలతో తెల్లవారుజాము నుంచే పుట్టలకు పాలు పోసి పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని పుల్లయ్య బంజర, చెన్నూరు, పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, లింగాల, కిష్టయ్య బంజర, బత్తులపల్లి ,పేరువంచ వెన్నవల్లి, ముచ్చవరం తదితర గ్రామాలలో ఉన్న మహిళా భక్తులు ఉపవాసాలతో పుట్టల వద్ద మొక్కులను తీర్చుకున్నారు.

## ప్రాథమిక విద్యను పటిష్టం చేసేందుకు ఫ్రీ ప్రైమరీ స్కూల్స్




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో తల్లిదండ్రులు ఆంగ్ల విద్యకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి ప్రైవేట్ పాఠశాలలకు నాలుగు సంవత్సరాలు వయసు గల పిల్లలను ఎల్కేజి యూకేజి చెర్పించేందుకు పంపిస్తున్నారని అక్కడి నుండి మొదలుకొని ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులు పై తరగతులకు కొనసాగుతున్నారని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుతూ ప్రభుత్వ విద్యను పటిష్టం చేసేందుకు నూతన ఫ్రీ ప్రైమారీ స్కూల్స్‌ను ప్రారంభిస్తుందని మండల విద్యా శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పిండిప్రోలు, తిరమలాయపాలెం, తాళ్ల చెరువు, గోపాలపురం, రమణతండా, కేసి తండా ప్రాథమిక పాఠశాలల్లో ఫ్రీ ఫ్రైమరీ స్కూల్స్ ప్రారంభించనున్నారు. దీని కోసం ప్రత్యేక తరగతి గది మౌలిక వసతులు, ఇక ఇన్‌స్ట్రక్టర్ ఆయాను నియమించనున్నారు. ఇప్పటికే విద్య అర్హత కలిగిన అభ్యర్థులను రాత పరీక్ష నిర్వహించి నియామక పత్రాలను అందించినట్లు అధికారులు తెలిపారు. అంగన్వాడీల్లో పాలు మరువని పిల్లల నుండి మూడు సంవత్సరాలలోపు పిల్లలు అంగన్వాడీల్లో ఉంటారని, నాలుగు సంవత్సరాల వయస్సు గల పిల్లలను ఫ్రీ ఫ్రైమరీ స్కూల్‌కి పంపిస్తారని అక్కడ ఎల్కేజి నుండి యుకేజి నేర్పించిన అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పిల్లలను పంపిస్తారని వారు తెలిపారు. నాలుగు సంవత్సరాల పిల్లను గుర్తించేందుకు పిండిప్రోలు గ్రామంలో సిడిపిఓ కవిత ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంతరాణి, సూపర్వైజర్ స్రవంతి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు సర్వే నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రాథమిక విద్యను పటిష్టం చేస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది.

## ఘనంగా నాగులచవితి వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** నాగుల చవితి పర్వదినం సందర్భంగా మధిర పట్టణం, మండలంలో వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శివాలయం వద్ద ఉన్న పుట్ట వద్ద అధికసంఖ్యలో భక్తులు నాగుల చవితి సందర్భంగా పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా దెందుకూరులోని శ్రీకృష్ణ సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలోని నాగేంద్రస్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. పూజారి ప్రసాద్‌శాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. దెందుకూరు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని నాగేంద్రస్వామి దేవాలయాల్లో నాగులచవితి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

## బిఎల్‌ఓలకు అవగాహన




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని తహాశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఓ లకు అవగాహన కార్యక్రమాన్ని తహాశీల్దార్ పులి సాంబశివుడు శనివారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో చేపట్టే స్పెషల్ ఇంటెన్సు రివిజన్ కార్యక్రమాన్ని నిర్వహించి పలు అంశాలపై సలహాలు సూచనలను తెలియపరిచారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు సంబంధించిన జాబితా పత్రాలను బిఎల్‌ఓ లకు అందించారు. వాటి ఆధారంగా త్వరలో జరగబోయే వార్డు స్థాయిలో ఎన్నికలు ఓటర్ లిస్టులో నమోదైన వ్యక్తుల వివరాలపై సమీక్షలు నిర్వహించారు. దీనివల్ల ఒకే గ్రామంలో రెండు లిస్టులలో ఒకే వ్యక్తి పేరు ఉండే అవకాశం ఉండదు అదేవిధంగా ఓటర్లకు సంబంధించిన పూర్వ పరాలను ఈ రివిజన్లో బిఎల్వోలు సమీక్షించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు తడకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ పులి సాంబశివుడు, ఆర్‌ఐలు ఉమామహేశ్వరరావు, సుజాతలతోపాటు బిఎల్వోలు పాల్గొన్నారు.

# పిల్లలకు పఠన సామర్థ్యం ఉండాలి

**-ప్రతి రోజు ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ అమలు**
**-ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమంపై కలెక్టర్ సమీక్ష**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు వంద శాతం పఠన సామర్థ్యం ఉండాలనే ఉద్దేశంతో ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి కార్యక్రమ అమలుపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని అక్టోబర్ 27 (సోమవారం) నుంచి ప్రారంభిస్తున్నామని పాఠశాల సమయాల్లో మాత్రమే ఈ కార్యక్రమం అమలు చేసేలా డిజైన్ చేయడం జరిగిందన్నారు. ప్రతి రోజు గంట సమయం ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల రీడింగ్ స్కిల్స్ పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకు గంటసేపు ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదవ తరగతి చదివే పిల్లలకు ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలు చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఆంగ్ల భాష ఫోనెటిక్స్ బేసిక్‌గా ఈ కార్యక్రమం డిజైన్ చేశామన్నారు. ప్రతి ఆంగ్ల అక్షరం ఏవిధంగా సౌండ్ చేస్తుంది అనేది విద్యార్థులకు తెలిసేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలన్నారు. చిన్న చిన్న పదాలతో ఫోనోటిక్ సౌండ్ నేర్పించాలని కలెక్టర్ తెలిపారు. సులువైన పదాలతో ప్రారంభించి సరళంగా ఆంగ్లం చదివే సామర్థ్యం వచ్చేలా మెటీరియల్ తయారు చేశామన్నారు. ప్రతి టీచర్ అక్టివిటి, స్టూడెంట్ అక్టివిటి ఒక స్టోరీగా చెబుతూ పిల్లలను ఇంట్రాక్ట్ చేస్తూ ఈ కార్యక్రమం అమలు చేయాలన్నారు. నెల రోజుల పాటు ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమాన్ని సరిగ్గా అమలు చేస్తే ప్రతి విద్యార్థికి చదివే సామర్థ్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని తరగతి గదిలోని ప్రతి విద్యార్థికి అవకాశం వచ్చేలా చూడాలన్నారు. ప్రతి బుధవారం విద్యార్థి రీడింగ్ స్కిల్స్ ఏ స్థాయిలో ఉన్నాయో (అక్షరాలు, పదాలు, వ్యాఖ్యలు) యాప్‌లో అప్‌డేట్ చేయాలని ఉపాధ్యాయులు వాస్తవ పరిస్థితులను అప్‌డేట్ చేయాలని తప్పుడు రిపోర్టులు పెట్టవద్దని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సిహెచ్ రామకృష్ణ, సిఎంవో ప్రవీణ్, ఆర్ఎంవో ప్రభాకర్‌రెడ్డి, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# 27న జరిగే పెన్షనర్ల ధర్నాను జయప్రదం చేయండి

**-పెన్షనర్లకు ఎస్‌జిపిఏటి పిలుపు**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే పెన్షనర్ల ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఏటి) రాష్ట్ర కార్యదర్శి వి. మేరీ ఏసుపాదం, ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య లు పిలుపునిచ్చారు. శనివారం కృషి భవన్‌లో పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఎస్‌జిపిఏటి ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రావాల్సిన ఉద్యోగ విరమణ బకాయిలు రాక పలువురు పెన్షనర్లు తనువు చలించారన్నారు. 2024 మార్చి నుంచి 10వేల మందికి పైగా ఉద్యోగ విరమణ పొందారని వారికి రావాల్సిన బకాయిలు సకాలంలో రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉద్యోగ విరమణ బకాయిలు తీసుకోకుండానే నలుగురు తనువు చలించారని ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాయల రవికుమార్, ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, కె. శరత్‌బాబు, ఉడుగు వెంకటేశ్వర్లు, జిల్లా వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శులు బి. కృష్ణకుమారి, తాడి అంజలి, కొట్టె అన్నమ్మ, జిల్లా కార్యదర్శులు రాధాకృష్ణమూర్తి, ప్రసాదరావు, మధుకర్‌రెడ్డి, నాగప్రసాద్, కృష్ణారావు, సుధాకర్, ఆళ్ల రామారావు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

# టిటిడి ఆలయ ప్రతిపాదిత స్థలంలో శ్రమదానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిపాదిత స్థలంలో అల్లిపురం, కొత్తగూడెం స్థానికులు శనివారం శ్రమదానం నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో టిటిడి ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ అల్లిపురం వద్ద సర్వే నెం. 408లో కొండరాసి గుట్ట వద్ద 20 ఎకరాల స్థలాన్ని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ప్రతిపాదించారు. అట్టి స్థలాన్ని స్థానికులు శనివారం శుభ్రం చేసేందుకు శ్రమదానం నిర్వహించారు. స్థానికులు భారీగా తరలి వచ్చి పండుగ వాతావరణంలో ఆలయ స్థలాన్ని శుభ్రం చేశారు. ప్రతి శనివారం ఆలయ స్థలంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు స్థానికులు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా ఖమ్మం నగరానికి ఐకాన్‌గా నిలిచేలా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణం పూర్తయితే ఖమ్మం నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రావూరి సైదబాబు, సంక్రాంతి నాగేశ్వరరావు, పగడాల మల్లేష్, రావుల హన్మంతరావు, ఎర్రబోయిన గోవింద్, వెనిగళ్ల నాగేశ్వరరావు, పత్తిపాటి అప్పారావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, వి. మల్లయ్య, సామినేని ముత్తయ్య, గుండె ఆదినారాయణ, పొదిల ఉపేందర్ పాల్గొన్నారు.

**సర్వే నిర్వహించిన అధికారులు :**
శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదిత స్థలంలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. శనివారం ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు ఆధ్వర్యంలో సర్వేయర్, ఆర్ఐలు ప్రతిపాదిత స్థలంలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. త్వరలో ప్రతిపాదిత స్థలాన్ని టిటిడికి అప్పగించనున్నారు.

# నోటు పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/చింతకాని :** మండల పరిధిలోని నర్సింహాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వర్లు రేణుక దంపతులు వారి ప్రథమ కుమారుడు యశ్వంత్ జయంతి సందర్భంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, అంగన్‌వాడీ టీచర్ పద్మ, స్థానికులు వెంకటట్, రాములు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు 30 గజాల కుదింపుపై హర్షం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి 30 గజాల స్థలంలో కూడా జిప్లస్ 1 ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతులు ఇవ్వడం పట్ల ఖమ్మం కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఖమ్మం నియోజక వర్గంలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించాలనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంకల్పానికి అనుగుణంగా ముందడుగు పడిందన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఖమ్మం నగర పాలక సంస్థ పాలక వర్గం తరుపున మేయర్ ధన్యవాదాలు తెలిపారు.

# పారిశుధ్య పనులు పరిశీలించిన మేయర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :**
ఖమ్మం కార్పోరేషన్‌లో పలు డివిజన్లలో మేయర్ పునుకొల్లు నీరజ పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. శనివారం నగరంలోని 32, 36 డివిజన్లలో మేయర్ పునుకొల్లు నీరజ పర్యటించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, ఉమెన్స్ కాలేజీ, రజక వీధిలో మేయర్ పర్యటించి పారిశుధ్య పనులను, గ్యాంగ్ వర్క్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పారిశుధ్య కార్మికులు విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలన్నారు. చెత్త సేకరణ, కాలువలను శుభ్రం చేయడం, రోడ్లపై మట్టి కుప్పలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ అనిల్‌కుమార్, శానిటేషన్ సూపర్ వైజర్ సాంబయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు, శంకర్, నాయకులు బాలగంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంక్‌కు మెట్లు ఏర్పాటు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :**
మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామంలో వాటర్ ట్యాంక్‌కు ఐరన్ మెట్లను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రజలకు తాగునీటిని అందించే వాటర్ ట్యాంక్ మెట్లు శిథిలావస్థకు చేరడంతో ఇట్టి విషయాన్ని కాంగ్రెస్ నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మెట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. శిథిలావస్థలో ఉన్న మెట్ల స్థానంలో నూతనంగా ఐరన్ మెట్లను శనివారం ఏర్పాటు చేశారు. సమస్య చెప్పిన వెంటనే పరిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గ్రామస్తుల తరుపున నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** న్యాయం అందరికి సమానమేనని దానిని పొందే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కెవి చంద్రశేఖర్‌రావు తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెవి చంద్రశేఖర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజన వృద్ధుల కోసం న్యాయ సేవలు అందిస్తామన్నారు. ప్రతి శనివారం, సోమవారం పారా లీగల్ వాలంటీర్లు అందుబాటులో ఉంటారని సీనియర్ సిటిజన్స్ సమస్యలు వారికి చెబితే రెవెన్యూ డివిజనల్ అధికారికి అందజేస్తారన్నారు. వయోజన వృద్ధుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన న్యాయ సహాయ కేంద్రమన్నారు. ఆర్డీవో జి. నర్సింహారావు మాట్లాడుతూ వయోజన వృద్ధులకి సంబంధించి మెయింటినెన్స్ మాత్రమే వారి పరిధిలో ఉంటుందని, భూ తగాదాలు, గిఫ్ట్ డీడ్స్ మార్చమని వచ్చే దరఖాస్తులు కలెక్టర్ పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటరీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాములకు అన్నదానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని యుపిహెచ్ కాలనీలో గల శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మూలగుండ్ల రమేష్ జ్ఞాపకార్థం వారి సతీమణి లక్ష్మి శనివారం ఆలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అన్నారు. కార్తీకమాసంలో వందలాది మంది అయ్యప్పస్వాములకు అన్నదానం నిర్వహించే అవకాశం దొరకడం దేవుడు ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో బీరెడ్డి రమేష్ దంపతులు, ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాగృతి రాష్ట్ర కార్యదర్శిగా కిషన్ నాయక్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శిగా, ఎస్టి వింగ్ కో ఆర్డినేటర్‌గా ఖమ్మం నగరానికి చెందిన బానోత్ కిషన్ నాయక్‌ను నియమించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్రంలోని, అన్ని జిల్లాల అనుబంధ విభాగాల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతనంగా నియమితులైన బాధ్యులు సంస్థ ఆశయాలు, లక్ష్య సాధన కోసం అంకిత భావంతో, సేవాధృక్పథంతో పనిచేయాలని కవిత సూచించారు. ఈ సందర్భంగా బానోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శిగా, ఎస్టి వింగ్ కో ఆర్డినేటర్‌గా నియమించినందుకు కవితకు ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత అప్పగించినందుకు ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బానోత్ కిషన్ నాయక్ ఎన్నిక పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## సిపిఐ వందేళ్ల వేడుకను ఊరు, వాడ పండుగలా జరుపుకోవాలి

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్నవెంకట్‌రెడ్డి**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : సిపిఐ వంద ఏళ్ల వేడుకను ఊరు,వాడ పండుగల జరుపుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ఎఫ్‌సిఐగౌడం వద్ద వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన వాల్‌పెంటింగ్‌ను మునిసిపాలిటీ సిపిఐ బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భారతదేశంలో 100ఏండ్ల చరిత్ర కలిగిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. అటువంటి పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు ఖమ్మం అతిధ్యం ఇస్తుండటం ఇక్కడి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి దక్కి గౌరవంగా అభివర్ణించారు. ముగింపు వేడుకల విజయంతానికై గడపగడపకు వెళ్లి విస్తృత ప్రచారం చేయాలని సిపిఐ శాఖలకు సూచించారు. ఈ వందేండ్ల ప్రస్థానంలో సిపిఐ పార్టీ చేసిన పోరాటాలు, ఉద్యమాలు, వాటి ద్వారా వచ్చిన ప్రతిఫలాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, సిపిఐ మండల సమితి సభ్యుడు దండి రంగారావు, మున్సిపాలిటీ నాయకులు పాల్తియా శ్రీను, వెంపటి రాము, లగిశెట్టి రమేష్, బియ్యాల రాజు, దేవిశెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.


## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని సత్యనారాయణపురంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను శనివారం వేశారు. దీనిని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకు డాక్టర్ కే.రమ పరిశీలించి, యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంరూరల్ పశువైద్యాధికారి డాక్టర్ అనంతు హరీష్, వైద్య సిబ్బంది రవికుమార్, పాషా, రామారావు, గోపాల మిత్రులు వెంకటేశ్వర్లు, సందీప్, వినయ్, శ్రీను, రైతులు ఉపేందర్‌రెడ్డి, జనార్థన్‌రెడ్డి, నరేష్‌రెడ్డి సాంబిరెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ నాయిబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక





ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : తెలంగాణ నాయిబ్రాహ్మణ సంఘం ఐక్యవేదిక ఖమ్మం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులను రాష్ట్ర కమిటీ శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షులుగా ఖమ్మం పట్టణానికి చెందిన నంద్యాల నరసింహారావు, కార్యదర్శిగా రావుల పాటి శ్రీనివాస్‌రావులను ఎన్నుకున్నట్లు నరసింహారావు తెలిపారు. వీరిని నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు, మిత్రుల, కుటుంబ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...జిల్లాలో నాయిబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. అలాగే ఇతర కార్యవర్గాన్ని త్వరలో జిల్లా మహాసభను ఏర్పాటు చేసి ఏర్పాటు చేస్తామన్నారు.

# పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవాలి

**-జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**



ప్రజాపక్షం/రఘునాథపాలెం : రైతులు పండించిన పత్తిని విక్రయించేందుకు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో యూరియా కంపెనీని జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ పత్తికి మద్దతు ధర పొందెందుకు రైతులు తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని సమీపంలోని సిసిఐ కేంద్రాల్లో విక్రయించాలని ఆయన సూచించారు. మోతాకు మించి నత్రజని ఎరువులను వాడితే ఎటువంటి ప్రయోజనం ఉండదని, పంటలు చీడ పీడ బారినపడి దిగుబడి తగ్గే అవకాశం ఉందని తెలిపారు. విత్తనం మొక్కజొన్న సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన కంపెనీలతో అగ్రిమెంట్ కుదుర్చుకోవాలని తద్వారా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. ఉమామహేశ్వరరెడ్డి, సొసైటీ సిఈవో వి. శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి : ఇటికాల



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో శనివారం ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదేండ్లుగా ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం మారిన పాలన మారలేదని విద్యార్థుల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఎనిమిది వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు పలుమార్లు నిరవధిక బంద్ నిర్వహించిన ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందన్నారు. వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో ఎంఎల్‌ఏలు, ఎంపిలు, మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ నాగులమీరా, శివ, వంశీ, గోపి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు




ప్రజాపక్షం/ బోనకల్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ నళిని అధ్యక్షతన మాదక ద్రవ్యాలు సేవనం దుష్పరిణామాలు, నివారణ చర్యలపై అవగాహన సదస్సును నిర్వహించారు. బోనకల్ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ స్రవంతి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సేవనం యువతను నిర్వీర్యం చేస్తుందని, ఆరోగ్యపరంగా, ఆర్థికంగా కుటుంబపరంగా ఎన్నో సమస్యలు గురి చేస్తుందని తెలిపారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, వాటికి దూరంగా ఉంటూ మంచిగా చదువుకోవాలని, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని, ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలని సూచించారు. స్నేహితులు ఎవరైనా ఈ మాదక ద్రవ్యాలు సేవిస్తున్నారని గ్రహించినప్పుడు వారి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి తిరుపతిరావు, ఆంటీ నార్కోటిక్ కమిటీ సభ్యులు పి.లక్ష్మీకాంతం, వి.రామకృష్ణ, జి.ప్రియకుమార్‌రెడ్డి, అధ్యాపకులు జి.జోనాతాన్‌బాబు, డి. రాజేంద్రకుమారి, డి.పద్మావతి, యం.రమేష్, గ్రంథపాలకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ప్రజాపక్షం/చింతకాని : అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం చింతకాని మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభం నుండి అధిక వర్షాల వల్ల పంట దిగుబడి తగ్గడంతో రైతలు పూర్తిగా నష్టపోయారన్నారు.నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30000 నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రైతులకు పంట భీమా సౌకర్యం కల్పించి భీమా డబ్బులు చెల్లించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రాచబంటి రాము, నాయకులు వత్సవాయి జానకిరాములు, నన్నక కృష్ణమూర్తి, వీరబాబు, యజ్ఞనారాయణ, మడిపల్లి కిరణ్‌బాబు, గడ్డం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆ కుటుంబంపై విధి పగ పట్టిందా..!



ప్రజాపక్షం/ బోనకల్ : బోనకల్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఓ పేద కుటుంబంపై విధి పగ పట్టినట్టు ఉంది. వివరాలిలా ఉన్నాయి. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తాటికొండ అపర్ణ ఇంటర్మీడియేట్ చదువుతుంది. అపర్ణ గత కొంతకాలంగా ఆరోగ్యం బాగో లేకపోవడంతో వివిధ ఆసుపత్రులను సంప్రదించారు. ఇప్పటికే రూ.10లక్షలు ఖర్చు చేసినా రోగం నయం కాలేదు. చివరిగా హైద్రాబాద్‌కు తీసుకువెళ్తే అపర్ణకు లివర్ సమస్య ఉందని వైద్యులు సూచించారు. ఆపరేషన్‌కు రూ.30లక్షలు ఖర్చుఅవుతుందని డాక్టర్లు తెలిపారు. కుటుబంగా పేదవారైన వారు దాతలు ఎవరైనా సాయం అందిస్తే తమ కూతుర్ని బతికించుకుంటామని తల్లి చెప్పే ఆవేదన కంట తడి పెట్టిస్తుంది. మనం చేసే సాయం చిన్నదైనా కావచ్చు కాని ఒక ప్రాణానికి అది ఎంతో విలువనిస్తుందని, దాతల సహాయం చేయాలని బాధిత తల్లి ఆవేదనతో కోరుకుతుంది.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి**



ప్రజాపక్షం/మణుగూరు: డిసెంబర్ 26వ తేదీన ఖమ్మంలో 5 లక్షల మంది తో జరుగు సిపిఐ శత జయంతి ముగింపు వేడుకలు, భారీ బహిరంగ సభ ను జయ ప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పినపాక మండల కార్యవర్గ, ముఖ్యుల సమావేశం కామ్రేడ్ కోయకుంట్ల రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఖమ్మం లో డిసెంబర్ 26వ తేదీన జరుగు సిపిఐ శత జయంతి ముగింపు వేడుకల కోసం ఇప్పటినుండే గ్రామ గ్రామాన కరపత్రం ద్వారా సిపిఐ 100 సంవత్సరాలు చరిత్ర ను వివరిస్తూ ప్రచారం కొనసాగించాలని, ఓ వైపు ప్రచారం చేస్తూనే బహిరంగ సభకు వెళ్ళటానికి అవసరమయే నిధులు సమకూర్చుకోవాలని వారు అన్నారు. దీని కోసం జానాసేవధల్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున 3 రోజుల పాటు శిక్షణా ఉంటుందన్నారు. బహిరంగ సభకు సిపిఐ శ్రేణులు, మహిళలు, యువకులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కర్షకులు, గిరిజనులు అన్ని వర్గాల ప్రజలు సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి రాజా, జాతీయ నాయకులు, వివిధ దేశాల ప్రతినిధులు సుమారు 40 దేశాల వారు హాజరవుతున్నారని, కావున దీనిని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గడ్డం మనోహరాచారి, పత్తిపాటి నాగేశ్వరరావు,తంగిల్లపల్లి వెంకన్న, మన్నెం ఐలయ్య, కారం సురేష్, రమేష్, పళ్ళ నాయుడు, వెంకటేశ్వర్లు, రమణ మరికొందరు పాల్గొన్నారు.

## ప్రణాళికతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు






ప్రజాపక్షం/సుజాతనగర్: ప్రతి ఒక్క విద్యార్థి ప్రణాళికతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని వేపలగడ్డ నందు గల అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల నందు శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వర రావు, సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ చావా లక్ష్మీ నారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని, సాఫ్ట్వేర్ రంగంలో కొత్త కొత్త టెక్నాలజీ లు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకుంటే ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని అన్నారు. నూతన విద్యార్థులకు రెండో సంవత్సరం విద్యార్థులకు మార్గ నిర్దేశం చేయాలని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే సైంటిస్టులు ఫార్మర్ల పాత్ర ఎంతగానో ఉందని కావున విద్యార్థులు ఆ వైపు దృష్టి సారించాలని అన్నారు. సివిల్స్ లో రాణించాలనుకునే విద్యార్థులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అదే విధంగా ప్రత్యేకంగా తరగతులు చెప్పేందుకు సైతం తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. విద్యార్థులకు గ్రూప్ వన్ ఆఫీసర్ భానోత్ పృథ్వీ మాట్లాడుతూ బీటెక్ విద్యను అభ్యసించేవారు ప్రతి ఒక్కరు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ లక్ష్య సాధనకు అనుగుణంగా విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. ఎన్పిటిఈఎల్, స్వయం కోర్స్ ఉద్యోగ అవకాశాలకు ఎంతగానో ఉపయోగపడతయాన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దయాకర్, రమేష్, శ్రీకాంత్, సైదయ్య, బాబురావు లక్పతి, హెచ్ ఓడి లు మునీర్, రవికిరణ్, కృష్ణమోహన్, వినోద్, వెంకటేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి

**సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్**



ప్రజాపక్షం/మణుగూరు: సిపిఐ శత జయంతి ముగింపు వేడుకలు ఖమ్మం లో డిసెంబర్ 26 న జరగనున్నాయని, 5 లక్షల మంది తో జరుగు సిపిఐ బహిరంగ సభ ను జయ ప్రదం చేయాలని కోరుతూ సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ నాయకత్వం లో శనివారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలో శివలింగాపురం గ్రామంలో ప్రచార కరపత్రం విడుదల చేశారు. ఇల్లు ఇల్లు కరపత్రం పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ మాట్లాడుతూ 100 సంవత్సరాలు ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించిన పార్టీ సీపీఐ అని, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ దన్నారు. దున్నేవానికే భూమి నినాదం తో దొరల గడిలను బద్దలు కొట్టి, పేదవాడికి భూములు పంచిన చరిత్ర సిపిఐ దన్నారు. అధికారం లేకున్నా, పేద ప్రజల పక్షాన నిలబడి వారి కోసం, వారి హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నది కమ్యూనిస్టు పార్టీ అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం నగరం లో జరుగు బారి బహిరంగ సభకు సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యకులు రాయల భిక్షం, కార్యవర్గ సభ్యులు ఆధర్ల రాములు, బోసెట్టి సంపత్‌లు పాల్గొన్నారు.

## ఏవో రామడుగు వాణి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెం, నేలపట్ల గ్రామాలలో రైతులకు మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన మొక్కజొన్న వేయదలుచుకున్న రైతులు తప్పని సరిగా సంబంధిత కంపెనీల ఏజెంట్ల నుండి అగ్రిమెంట్ తీసుకోవాలని సూచించారు. ఇతర ప్రదేశాల నుండి వచ్చి ఏజెంట్లు లేదా ఆర్గనైజర్లు, ఏజెంట్ల ద్వారా విత్తనాలు కొనుగోలు చేయవద్దని, స్థానికంగా తెలిసిన ఏజెంట్లు లేదా ఆర్గనైజర్ల ద్వారా మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, వారు ఒప్పుకున్న షరతులను తప్పని సరిగా పొందుపరుస్తూ అగ్రిమెంటు తీసుకోవాలని సూచించారు. అనంతరం పత్తి వేసిన రైతుకలు కపాస్ కిసాన్ యాప్ గురించి అవగాహన కల్పించారు. పత్తి వేసిన రైతుల వివరాలు గ్రామ పంచాయితీ కార్యాలయంలో ప్రదర్శించబడ్డాయని, రైతులు సరి చూసుకుని పొరపాట్లు ఉంటే వ్యవసాయ విస్తరణాధికారి వద్ద మొబైల్ నెంబర్ అప్డేట్ చేయించుకోవాలని తెలిపారు. అనంతరం కూసుమంచి గ్రామంలో జాతీయ ఆహార భద్రత పథకం పప్పు దినుసులు పథకంలో విత్తనాలు పంపిణీ చేసిన కంది పంటను పరిశీలించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రవి కుమార్, వంశీకృష్ణ, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

## డిఏ బకాయిలు చెల్లించి పిఆర్‌సి ప్రకటించాలి



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: డిఏ బకాయిలు చెల్లించి, పిఆర్సి ప్రకటించాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హాథీరామ్ డిమాండ్ చేశారు. జెడ్‌పిహెచ్‌ఎస్ మర్కోడు పాఠశాలలో ఆ సంఘం మండల అధ్యక్షులు అగ్గి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ పాఠశాలలకు తనిఖీ బృందాల పేరుతో ఉపాధ్యాయులను డిప్టేషన్‌పై తీసుకోవడం వల్ల ఆయా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతుందన్నారు. పర్యావేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయకుండా ఉపాధ్యాయులని తనిఖీ పేరుతో తీసుకోవడం వల్ల వచ్చే ప్రయోజనం ఏమీ లేదన్నారు. కాంప్లెక్స్ స్థాయి నుండి సిఆర్పిలు , ఎంఈవోలు, డీఈవోలు ఖాళీలు భర్తీ చేసి పర్యవేక్షణ చూడాలన్నారు. ఇప్పటికే పాఠశాలలో ఆన్లైన్ పేరుతో ఉపాధ్యాయులపై పని భారం పెరిగి బోధనా సమయం వృధా అవుతుందన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుల ప్రమోషన్స్ పండిట్ పీటీల అప్‌గ్రేడేషన్ చేపట్టాలని కోరారు. సిఆర్పిల శాలరీలు వెంటనే విడుదల చేయాలన్నారు. కేజీబీవీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. 2008 డిఎస్సీ ఉపాధ్యాయుల జీతాలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మండల బాధ్యులు డి నాగేశ్వరరావు, జి వీరన్న బాబు, ఈ సమ్మక్క, శారదామని, వేణు, ప్రేమ్ కుమార్, రమేష్ పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్‌లో వంద కుటుంబాలు చేరిక



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు అన్నారు. శనివారం మండల పరిధిలోని రాయిగూడెం గ్రామంలో ముఖ్య కార్యకర్తలో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు రాయిగూడెం, మైలారం, తునికుబండల, రామంజిగూడెం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నుండి 100 కుటుంబాలు తాటి నాగేశ్వరరావు, తాటి భద్రయ్య, గొగ్గెల రాజబాబు, సాగబోయిన నారాయణల ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ పార్టీలో చేరగా, వారిని రేగా కాంతారావు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలో ఆహ్వానించారు. ఈసందర్భంగా చేరిన వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో మోసపూరిత కాంగ్రెస్ పార్టీ బుద్ధి చెప్పుతామని తెలిపారు.

## సిపిఐ మండల సమితి సమావేశం



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండల సిపిఐ మండల సమితి సమావేశం మండల కార్యదర్శి ఊకే ఆది నారాయణ ఆధ్వర్యంలో తొట్టిపంపు గ్రామంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు బొర్రా కేశవరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలే సిపిఐకి ఆయుధమని, ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమ భావజాలాలతో భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముగింపు ఉత్సవాల సభను ఖమ్మంలో డిసెంబర్ 26న ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్నారని, ఈ బహిరంగ సభకు ప్రజలంతా ఐక్యంగా తరలి రావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ పోటీ చేస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జడ శ్రీను, మండల నాయకులు పలగాని రామకృష్ణ, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు



ప్రజాపక్షం/సుజాతనగర్: నాగుల చవితిని పురస్కరించుకొని సుజాతనగర్ మండల కేంద్రంలో శివాలయం సమీపంలో భక్తులు పుట్టలో పాలు పోశారు. ప్రాతఃకాలము నందు స్నానాలు ఆచరించి భక్తులు తమ సమీపంలో ఉన్న పుట్టల వద్ద పాలు పోసి వివిధ రకాల పండ్లను ఉంచి ప్రసాదాలను పెట్టారు. నాగుల చవితి నాడు పుట్టలో పాలు పోయడం వలన నాగులమ్మ తమ కోరిన కోరికలు తీర్చుతుందని భక్తులు నమ్ముతున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఏడుగురికి రెండువేల రూపాయల జరిమానా, రెండురోజుల పాటు ట్రాఫిక్ ట్రాఫిక్ పోలీసులకు సహాయంగా నగరంలో ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విధులు నిర్వహిస్తూ కమ్యూనిటీ సేవ చేయాలని శనివారం ఖమ్మం స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి బక్కెర నాగలక్ష్మి తీర్పు వెల్లడించినట్లు ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ తెలిపారు.

# ప్రైవేట్ వ్యాపారులకు వరి ధాన్యం విక్రయాలు

**- బోనస్ చెల్లించనందుకే విక్రయిస్తున్నామని రైతుల ఆరోపణలు**



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండలంలో వరిసాగుకు రైతులు ప్రాముఖ్యతనిచ్చి మండల వ్యాప్తంగా ప్రతి సంవత్సరం వరిసాగు విస్తీర్ణాన్ని పెంచుతున్నారు. గత కాలాన్ని పోల్చుకుంటే ప్రస్తుతం మండలంలో నీటి వనరులు పెరగడం దానికి తోడు అధిక వర్షాలు కురవడం ముఖ్య కారణం కాగా తిరుమలాయపాలెం మండలంలో భక్తరామదాసు ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభించినప్పటి నుండి బీడు భూములకు సాగునీరు అందడంతో రైతులు వరి పంటను అధిక మొత్తంలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 13,500 ఎకరాల్లో వరి పంటలను సాగు చేశారు. కష్టపడి పండించిన వరిధాన్యాన్ని రైతులు అమ్ముకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సహకార సొసైటి ఐకెపి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ వరి ధాన్యాన్ని విక్రయిస్తే మేలు రకం సన్నాలకు రూ.2300 అసలు రేటు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఎక్కువ శాతం రైతులంతా కొనుగోలు కేంద్రాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి వరిధాన్యాన్ని ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 39వేల క్వింటాళ్లకు బోనస్ డబ్బులు రూ.1.95కోట్లు బకాయిలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. బోనస్ డబ్బులు చెల్లించనందుకే రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో ముందుగా సాగు చేసిన వరి పంట ఇప్పటికే పలు గ్రామాల్లో కోత మీషన్ల ద్వారా వరి పంటను కోయడం జరిగింది. ప్రైవేట్ వ్యాపారులు సన్నాలకు రూ.2200 ధరతో కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎలాంటి తూర్పాల లేకుండా పచ్చి వరి ధాన్యానికి రూ.2200 ధర ప్రకటించి కొనుగోలు చేస్తున్నామని ప్రైవేట్ వ్యాపారులు తెలిపారు. వరి రైతులు కూడా ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకు సుముఖత చూపుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాసి కాంటాలు కాక రైతులు రాత్రింబవళ్లు నానా అవస్థ పడ్డారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి బోనస్ డబ్బులు చెల్లిస్తే వరి రైతులు కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యాన్ని విక్రయించే అవకాశం ఉంది.

# నియోజకవర్గ చరిత్రలో తొలిసారి

**-నేడే మెగా జాబ్ మేళా**
**-నిరుద్యోగ యువత కోసం తాపత్రయం**
**-హాజరుకానున్న 80కు పైగా కంపెనీలు**
**-ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. దయానంద్**



ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయకుమార్ దంపతుల కృషితో సింగరేణి వారి సౌజన్యంతో సత్తుపల్లి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత కోసం నేడు మెగా జాబ్ మేళా పట్టణంలోని వేంసూర్ రోడ్ లో గల రాణి సెలబ్రేషన్స్ లో ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుంది. సత్తుపల్లి నియోజకవర్గ చరిత్రలో మొట్టమొదటిసారిగా సుమారు 80 కి పైగా కంపెనీలు ఈ జాబ్ మేళాకు హాజరు కాన్నుండటం ఓ రికార్డ్. గతంలో జరగని విధంగా నిరుద్యోగ యువతను ఉన్నతులుగా తీర్చిదిద్దే క్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దంపతులు ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని తమ భుజస్కంధాలపై వేసుకొని నిర్వహిస్తుండడం అభినందించాల్సిన విషయం. ఓట్ల కోసం కాకుండా, ప్రజల కోసం తాము పాటు పడతామని, తమకు ఓట్లేసిన యువత జీవితాలు అంధకారంలో ఉండిపోకూడదనే ఓ గొప్ప సంకల్పంతో ఈ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు ఎమ్మెల్యే దంపతులు. జాబ్ మేళాకు హాజరయ్యే ఏ ఒక్కరికి కూడా అసౌకర్యం కలగకూడదని కంటిమీద కునుకు లేకుండా అనుక్షణం ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, అందరిని కలుపుకుంటూ, కలగలుపుతూ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నారు ఎమ్మెల్యే దంపతులు. నిరుద్యోగమనే భూతాన్ని తరిమికొట్టి యువతను సన్మార్గంలో నడిపించాలంటే మంచి ఉపాధి కల్పించడమే మార్గమని ఆలోచించారు ఎమ్మెల్యే దంపతులు. మంచి చదువులు చదువుకున్న యువత సరైన ఉపాధి అవకాశాలు లేక, దొరకక చెడు మార్గాలలోకి పయనిస్తున్నారు. వారందరినీ సన్మార్గంలోకి తేవాలంటే ఉద్యోగం ఒక్కటే మార్గమని తలచి సత్తుపల్లి లో ఉన్న సింగరేణి వారి సహాయ, సహకారాలు తీసుకుని సుమారు రూ.30 లక్షల ఖర్చుతో ఈ మెగా జాబ్ మేళా ను నిర్వహిస్తుండడం నిజంగా ఓ వండర్ అనే చెప్పాలి. ఈ జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన యువత వారు బాగుపడటమే కాకుండా వారి కుటుంబాలను బాగు చేసుకుంటూ మరో తరానికి మార్గదర్శకులుగా నిలుస్తారనడంలో ఎటువంటి సందేహం లేదని మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇటువంటి జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినప్పుడు పల్లెలు, పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయని మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఇంతటి బృహత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ దంపతులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారనడంలో సందేహం లేదు మరి. నేడు జరుగుతున్న ఈ మెగా జాబ్ మేళాలో నిరుద్యోగ యువత భారీగా హాజరై తమ జీవితాలను ముళ్ళబాటల నుండి పూల పాన్పులవైపు మరల్చుకోవాలని ప్రజాపక్షం ఆకాంక్షిస్తుంది.

# సాయిస్ఫూర్తిలో రెనాల్ట్ నిస్సాన్ క్యాంపస్ రిక్రూట్మెంట్



ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని గంగారంలో గల సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ట్రిపుల్ ఈ) మెకానికల్ ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులకు ప్రముఖ కార్ల కంపెనీ రెనాల్ట్ నిస్సాన్ చెన్నై వారు జాతీయస్థాయిలో క్యాంపస్ ఇంటర్వ్యూలు శనివారం నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు తమ కళాశాల నుంచి 92మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ట్రైనింగ్,ప్లేస్ మెంట్ ఆఫీసర్ డా.డియన్ వి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ ఇంటర్వ్యూలను కంపెనీ హెచ్ ఆర్ మేనేజర్, యం.ప్రకాష్ నిర్వహించి ప్రీ ప్లేస్ మెంట్ టాక్, రాతపరీక్ష, టెక్నికల్ హెచ్ ఆర్, మౌఖిక ఇంటర్వ్యూ ద్వారా గ్రాడ్యుయేట్ ట్రైనీ ఇంజనీర్, ప్రొడక్షన్ ట్రైనీ ఇంజినీర్లుగా 40మందిని ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరిగిందని కంపెనీ ప్రతినిధి తెలిపారు. అదే విధంగా గ్రాడ్యుయేట్ ట్రైనీ ఇంజనీర్, ప్రొడక్షన్ ట్రైనీ ఇంజినీర్లుగా వివిధ కేటగిరిల్లో ఈసిఈ విభాగం నుంచి 33మంది, ట్రిపుల్ ఈ విభాగం నుంచి 6 మంది, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి 1 మొత్తం: 40మంది ఉద్యోగాలు పొందినట్లు కళాశాల సెక్రటరి, కరస్పాండెంట్ దాసరి.ప్రభాకర్ రెడ్డి తెలియజేశారు. అనంతరం దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు దక్షిణ భారతదేశంలోని బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలలో ఉద్యోగాలు చేయవలసి ఉంటుందని. వీరికి జీతం సంవత్సరానికి రూ. 3.5 లక్షలు అందుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాధికులు,హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత, రాజ్యసభ సభ్యులు, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డా. బండి.పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విదులు వర్చువల్ గా విద్యార్థినీ, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పూటుకూరి.శేషారత్నకుమారి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, సియస్ఈ విభాగాధిపతి డా. షేక్.యాకూబ్, కళాశాల ఈసిఈ, ట్రిపుల్ఈ విభాగాధిపతులు డా.పాముల శేఖర్ బాబు, కె.రామకృష్ణప్రసాద్, మెకానికల్ విభాగాధిపతి వి.వెంకట రామి రెడ్డి, అన్నీఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు పాల్గొన్నారు. కళాశాల ఫ్యాకల్టీ మెంబర్స్ ఉద్యోగ అర్హత సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## పలువురికి మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శ



ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన గద్దం శ్రీను, చెరుకుపల్లి గ్రామానికి చెందిన మాజీ ప్రెసిడెంట్ జగదీష్, యాతాలకుంట గ్రామానికి చెందిన మాజీ ప్రెసిడెంట్ మారమ్మ, రాయల గాంధీ తదితరులను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శనివారం పరామర్శించారు. అదే విధంగా కిష్టారం గ్రామంలో జరిగిన జంగం రమేష్ నూతన గృహప్రవేశ వేడుకకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. సండ్ర వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, గ్రంథాలయ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, డిసిసిబి డైరెక్టర్ మోదుగు పుల్లారావు, కోడిమెళ్ళ అప్పారావు, పాలకుర్తి రాజు, చాంద్ పాషా తదితరులున్నారు

## పోలీసు అమరవీరుల శాంతిని కాంక్షిస్తూ ర్యాలీ



ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని గంగారంలో గల 15వ ప్రత్యేక పోలీసు పటాలము నందు పోలీసు అమరవీరుల శాంతిని కాంక్షిస్తూ పోలీసు ఫ్లాగ్ డే2025 దినోత్సవాలలో భాగంగా గంగారం గ్రామంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ అదనపు కమాండెంట్ ఏ. అంజయ్య మాట్లాడుతూ పోలీస్ అమర వీరుల ఆత్మకు శాంతి కలగాలనే కాంక్షతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అధికారులు, సిబ్బంది బైక్ ర్యాలీని నిర్వహించటం జరుగిందన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్స్ ఎస్.శ్రీధర్ రాజా, యస్.డి.రంగారెడ్డి, ఆఫీసర్స్, కానిస్టేబుల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ప్రమాదంలో వల్లభి యువకుడు మృతి



ప్రజాపక్షం/ముదిగొండ : హైదరాబాద్ నుండి బెంగుళూరుకు వెళుతున్న కావేరి ట్రావెల్స్ బస్సు కర్నూలు జిల్లా సమీపంలో బైకును ఢీకొట్టగా బస్సుకు పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి 20 మంది మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదంలో మండలంలోని వల్లభి గ్రామానికి చెందిన చిత్తూరి మేఘనాథ్(25) అనే యువకుడు మృతి చెందాడు. అత్యవసర ద్వార గుండా 20 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రస్తుతం మేఘనాథ్ తల్లి, చెల్లెలతో హైదరాబాద్‌లో ఉంటూ, ఇటీవల బెంగుళూరు ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్వేర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఉద్యోగంలో ట్రైనింగ్‌లో ఉండగానే ఈ ప్రమాదంలో చోటుచేసుకుంది. మృతుడి తండ్రి చిట్టోజు శ్రీనివాస్ వల్లభిలోని ఐడిబి బ్యాంకులో గోల్డ్ లోన్ అప్రైజర్ విధులు నిర్వర్తిస్తున్నాడు. మేఘనాథ్ మృతితో వల్లభిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఘనంగా కమల్‌రాజ్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/చింతకాని : బొనాస మధిర నియోజకవర్గ ఇంచార్జ్ , మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు జన్మదిన వేడుకలు చింతకాని మండలంలో బొరాస శ్రేణులు ఘనంగా నిర్వహించారు. నాగులవంచలో బొరాస యువజన విభాగం ఆధ్వర్యంలో తలసెమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, నాయకులు మంకెన రమేష్, గద్దం శ్రీను, చాట్ల సురేష్, ఏడుకొండలు, కోపూరి నవీన్, అయ్యోరీ, సాయి, మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు విరాళాల సేకరణ



ప్రజాపక్షం/చింతకాని : డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు చింతకాని మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి.ఇప్పటికే మండల సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ప్రణాళికను సిద్ధం చేశారు. గ్రామాల్లో వాల్ రైటింగ్ తో పాటు శాఖ సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రచారాన్ని ప్రారంభించారు. ముగింపు సభ ప్రచారంలో భాగంగా శనివారం చింతకాని మండలంలోని నేరడ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహించడంతో పాటు విరాళాల సేకరణ చేస్తున్నారు. సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు నేరడ గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జున్, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, శాఖ కార్యదర్శి షేక్ దస్తగిరి, సహాయ కార్యదర్శి మట్టా రవి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు


ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి సేవ సమితి, సింగరేణి వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పరిధిలోని శ్రీ విద్యాభ్యాస ఎడ్యుకేషనల్ ఛారిటీ ట్రస్ట్, శ్రీ సత్య సాయి దివ్యాంగుల పాఠశాల నందు శనివారం ఒకే రోజు 2 చోట్ల ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు డిజిఎం (పర్సనల్) ఎస్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం ప్రతి సంవత్సరం ఉచిత వైద్య శిబిరాల కోసం ఒక షెడ్యూల్ రూపొందించడం జరిగిందని తెలియజేశారు. సింగరేణి యాజమాన్యం తమ వంతు సామాజిక బాధ్యతగా బొగ్గు గనుల పరిసర ప్రాంతాల గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న క్రమంలో భాగంగా శ్రీ విద్యాభ్యాస ఎడ్యుకేషనల్ ఛారిటీ ట్రస్ట్, శ్రీ సత్య సాయి దివ్యాంగుల పాఠశాల నందు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది అన్నారు. ఈ వైద్య శిబిరంలో విద్యార్థిని విద్యార్థులు మొత్తం 86 మంది వైద్య సేవలు అందుకోవడం ఎంతో సంతృప్తినిచ్చింది. ఈ వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులకు ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది అన్నారు. కాబట్టి సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించబడే వైద్య శిబిరాలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగపర్చుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవలసినదిగా తెలియజేశారు. అనంతరం సింగరేణి ఏరియా హాస్పిటల్ వైద్యులు డా. సౌజన్య మాట్లాడుతూ.. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎంతగానో ప్రబలుతున్నాయి అన్నారు. వాటి నుంచి



కాపాడుకోవడానికి గాను ప్రజలందరు ఇంటా బయట పరిశుభ్రతను పాటించాలని, ఏదైనా ఆహారం తీసుకున్న ప్రతి సారి తప్పనిసరిగా చేతులను శుభ్రపర్చుకోవాలి అన్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలు దోమల వల్ల సోకుతాయి కాబట్టి ఇంటి పరిసరాల్లో పూల కుండిల్లో, మురికి కాలువల్లో నీరు నిలువ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఏరియా హాస్పిటల్ వైద్యురాలుసౌజన్య, స్టాఫ్ నర్స్ రూపశ్రీ, ఎస్ఈఢ బ్ల్యూఏ సమితి కోఆర్డినేటర్ మారేశ్వర్ రావు, ఇతర సిబ్బంది రాము, ఉదయ్, విద్యాభ్యాస ఎడ్యుకేషనల్ ఛారిటీ ట్రస్ట్, శ్రీ సత్య సాయి దివ్యాంగుల పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ నీటి సరఫరాను తగ్గించండి

ప్రజాపక్షం/కల్లూరు: ఖరీఫ్ కు సంబంధించిన వరి పంట కోతకు నాగార్జునసాగర్ నీటి సరఫరాను తగ్గించి మధిర బ్రాంచ్ కెనాల్ పరిధిలోని రైతులు జల వనరుల శాఖ అధికారులను కోరుతున్నారు. నీటి సరఫరా వలన వరి పొలాలలో కోతకొచ్చిన సమయంలో నీరు తడిసి పంట తడిసిపోతుందని ఈ సమయంలో చేతికి వచ్చిన పంటలో తడిసి పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని దీంతో నీటి సరఫరాను తగ్గించాలని రైతులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు సాగర్ అధికారులను కోరుతున్నారు. మండల పరిధిలోని చంద్రుపట్ల, రఘునాథగూడెం, జిడిపిపల్లి, వాచ్యనాయక తండా, చెన్నూరు, లింగాల, పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి తదితర గ్రామాలలో పంట కోతకొచ్చిందని ప్రస్తుతం నీరు అవసరంలేదని అధికారులకు తెలియపరుస్తున్నారు. దీంతోపాటు పుణ్యపురం మేజర్, బసవాపురం మేజర్ తదితర మేజర్ కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గించాలని జల వనరుల శాఖ అధికారు



లను కోరుతున్నారు. ఇప్పటికే వాగులు, వంకలకు నీరు వృధా అవుతుందని పర్యవేక్షించి నీటి వృధాను తగ్గించాలని అధికారులను కోరుతున్నారు ప్రతిరోజు వర్షాలతో నీటి అవసరం లేదని తెలుపుతున్నారు.

# విద్యార్థులు సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి



ప్రజాపక్షం/చింతకాని : విద్యార్థులు సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని చింతకాని తహసీల్దార్ బాబ్జి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో భాగంగా ఖమ్మం గాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థులు మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్

**తహసీల్దార్ బాబ్జిప్రసాద్**

కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బాబ్జిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు నిర్దిష్టమైన ప్రణాళికతో గ్రామప్రజల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,ఆరోగ్య నియమాలపై చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు.ఎస్ఐ వీరేందర్ మాట్లాడుతూ నేటి యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని అవి పట్టణాలు దాటి పల్లెల్లో కూడా ప్రవేశించాయని వాటి వల్ల కలిగే అనార్థాలను గ్రామంలోని ప్రతి ఒక్కరికీ తెలిసే విధంగా అవగాహన కల్పిస్తూ సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కొండపర్తి గోవిందరావు, జిల్లా ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాస్ కళాశాల ప్రిన్సిపల్ సునీల్ కుమార్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ విజయమ్మ, కళాశాల డైరెక్టర్ కుటుంబరావు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి


ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ప్రకృతి వైపరీత్యాల వలన రైతులు పండించిన పంటలకు దిగుబడి రాక ఆర్థిక ఇబ్బందులతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని రేమిడిచర్ల గ్రామశాఖ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ బృందం వివిధ పంటలను క్షేత్రస్థాయిలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు నెలల నుండి కురుస్తున్న వర్షాలకు పంటలు దిగుబడి తగ్గి చేసిన అప్పులు తీర్చలేక రైతులు అగమ్యగోచరంగా అల్లాడిపోతున్నారని ఆవేదన చెందారు. ప్రకృతి వైపరీత్యాల వలన రైతులు పడుతున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఎర్రుపాలెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి అన్ని విధాలుగాఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27వతేదీన సోమవారం ఎర్రుపాలెం మండల తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై జరిగే ధర్నాను పార్టీలకతీతంగా రైతులందరూ సకాలంలో హాజరై



ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు గొల్లపూడి పెద్ద కోటేశ్వరరావు, వీరాంజనేయులు, దివ్వెల ఆంజనేయులు, నాగులవంచ వెంకట్రామయ్య, కొండేపాటి గురవయ్య, చలమాల సత్యనారాయణ, బత్తుల పుల్లారావు, కొండపాటి శివయ్య,, కొమ్మూరి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# రౌడిషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : జిల్లాలో తమతమ పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడిషీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై నిత్యం నిఘా ఉంచాలని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ పోలీసుల అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గంజాయి రవాణ, విక్రయాలు చేస్తున్న వారితో పాటు మూడేళ్లుగా భూదందాలు, దౌర్జన్యాలు, సెటిల్‌మెంట్లు చేస్తూన్న వారిని గుర్తించి పిడి యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపాలన్నారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు శుక్రవారం రాత్రి తమ పరిధిలోని రౌడిషీటర్ల ఇళ్లకు వెళ్లి వారి కదలికలపై ఆరా తీశారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నేరస్తులు సత్ప్రవర్తన కలిగిఉండాలని వారికి సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి ఒక్కరిపై నిఘా ఉంచామని నేరప్రవృత్తి వదిలి సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. తొందరపాటుతో నేరాలు చేసి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. సత్ప్రవర్తన కలిగిన ఉన్న వారిపై రౌడిషీట్ ఎత్తివేస్తామని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.





# షముఖ హాజరులో చింతకాని స్టేట్ ఫస్ట్

ప్రజాపక్షం/చింతకాని : విద్యార్థుల ముఖ హాజరులో చింతకాని మండలం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరక్టర్ రాధారెడ్డి చింతకాని మండల విద్యాశాఖాధికారి సలాది రామారావును సన్మానించి ప్రశంసాపత్రము అందజేశారు.ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషినల్ కలెక్టర్ లోకల్‌బాడీస్, జిల్లా విద్యాశాఖాధికారి పి శ్రీజ పర్యవేక్షణ మరియు సలహాలతో మండల ఉపాధ్యాయుల సహకారంతో మండలాన్ని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచే విధంగా ముందుకు తీసుకెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఆర్‌టీ డైరెక్టర్ రమేష్, రీజనల్ డైరెక్టర్ వరంగల్ సత్యనారాయణ రెడ్డి, టెక్ట్స్ బుక్ డైరెక్టర్ శ్రీనివాసచారి పాల్గొన్నారు.



# పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ నమోదు చేసుకోవాలి

ప్రజాపక్షం/చింతకాని : పత్తి రైతులు తమ పత్తిని సీసిఐ కేంద్రాల్లో అమ్ముకోవాలంటే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్ తప్పని సరిగా మొబైల్ యాప్‌లో నమోదు చేసుకోవాలని మధిర ఏడిఏ స్వర్ణ విజయచంద్ర రైతులకు సూచించారు. మండలపరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో కపాస్ కిసాన్ యాప్ పై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏడిఏ విజయచంద్ర మాట్లాడుతూ రైతు తన మొబైల్ నెంబర్‌తో లాగిన్ అయి స్లాట్ బుక్ చేసుకుని జిన్నింగ్ మిల్లులకు నిర్దేశించిన తేదీకి పత్తిని తీసుకెళ్లి విక్రయించాలన్నారు. పత్తి సాగు చేసిన రైతులందరూ సంబంధిత ఏఈవో వద్దకు వెళ్లి పంట నమోదు వెబ్ సైటులో మొబైల్ నెంబర్ సరిగా ఉందో లేదో సరిచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సోములపల్లి మానస, ఏఈవోలు కార్తీక్, తేజ, రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా లింగాల జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల కేంద్రం ఎర్రుపాలెంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు శనివారం మండల కార్యదర్శి యన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ జెడ్పి చైర్మన్, మధిర బిఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి లింగాల కమల్‌రాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శీలం కవిత, మాజీ ఎంపిటిసిలు మస్తాన్‌వలీ, మల్లికార్జున్‌రెడ్డి, కృష్ణారావు, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, హుస్సేన్, కోట లోకేష్, బుర్ర నర్సింహారావు, తిరుపతిరావు, కృష్ణారెడ్డి, తిరుమలారావు, సైదులు, బ్రహ్మానందరెడ్డి, సింహాద్రి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# కేఎస్ఆర్ గ్రానైట్ వారి సహకారంతో నిత్యాన్నదానం ప్రారంభం

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకోవటానికి వచ్చే భక్తులకు జమలాపురం శ్రీ వెంకటేశ్వరసేవా సమితి ఆధ్వర్యంలో ఖమ్మం కేఎస్ఆర్ గ్రానైట్స్ అధినేతలు తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతుల సహకారంతో నిత్యాన్నదానం కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులకు వారానికి ఒక రోజు శనివారం మాత్రమే నిర్వహించే అన్నదాన పథకాన్ని దాతల సహకారంతో ప్రతిరోజు నిర్వహించనున్నట్లు తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలకుమారి తెలిపారు. కార్తీక మాసం అన్ని రోజులు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. దాతల తమ సహకారాన్ని అందించి కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నదాన సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# సైబర్ సెక్యూరిటీపై అవగాహన కలిగి ఉండాలి




## జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్

**ప్రజాపక్షం/మణుగూరు:** సైబర్ సెక్యూరిటీ పై అవగాహన కలిగియుండాలని సింగరేణి జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖకు సంబంధించిన ఐటి సెల్ విభాగం ఆదేశం మేరకు సింగరేణి యాజమాన్యం శనివారం మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా ఏరియాలో పని చేస్తున్న సంబంధిత సిబ్బందికి ఉదయం, అధికారులకు సాయంత్రం అవగాహన కార్యక్రమాలు చేబట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తూ నేడు సైబర్ నేరగాళ్ళు ఎంతటి మోసాలకు పాల్పడుతున్నారో మనమందరం ప్రతి రోజు వివిధ మాధ్యమాల ద్వారా తెలుసుకుంటూనే ఉన్నామన్నారు. కావున స్కామర్ల బారిన పడకుండా ఉండేందుకు సైబర్ హైజెనిక్ తప్పనిసరిగా పాటించాలి అన్నారు. అందుకు గాను సైబర్ సెక్యూరిటీ చర్యలను పటిష్టంగా చేబట్టాలి అన్నారు. సంస్థల డేటా బేస్ లను లక్ష్యంగా చేసుకొని మోసగాళ్ళు నిధులు లేదా డేటాను దొంగలించే ప్రయత్నం చేయకుండా సైబర్ భద్రత వ్యవస్థ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ నుంచి విచ్చేసిన డిజిఎం(ఐటి) ఎం. శ్రీనివాస రావు, డివై. సిఐఎస్ఓ అండ్ మేనేజర్ (ఐటి) డి.ఎస్, నానా ఫడ్నవిస్ అధికారులకు, సిబ్బందికి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరిస్తూ హానికరమైన సైబర్ కార్యకలాపాలు ప్రజల భద్రతకు, మన జాతీయ, ఆర్థిక భద్రతకు ముప్పు కలిగిస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్, ఏఎస్ వెంకట రామా రావు, ప్రాజెక్ట్ అధికారి పికేఓసి వీరభద్ర రావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ మణుగూరు ఓసి ఈ. శ్రీనివాస్, ఏజిఎం(ఐఈడి) సిహెచ్ రాంబాబు, డిజిఎం(పర్సనల్) ఎస్ రమేష్, డిజిఎం (ఫైనాన్స్) అనురాధా, డిజిఎం(కేసిహెచ్ పి) మధన్ నాయక్, డివై.సిఎంఓ జ్యోతిర్మై, క్వాలిటీ హెడ్డి నాగరమేష్, ఇతర ఉన్నత అధికారులు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఐటి మేనేజర్ సాయిల సురేశ్ , మేనేజ్మెంట్ ట్రైనీ(ఐటి) సిహెచ్. శ్రీకర్ తేజ, తదితర అధికారులు, మినిస్ట్రియల్ స్టాఫ్, పిఏ టుజిఎం రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోరాట యోధులు మద్దెల నరసయ్య



**ప్రజాపక్షం/కారేపల్లి:** చీమలపాడు ప్రాంతంలో పోడు పోరాటాలు, ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలలో పిడి యాక్ట్ని సైతం ఎదుర్కొని జైలు జీవితం అనుభవించిన గొప్ప నాయకులు సిపిఎం సీనియర్ నాయకులు మద్దెల నరసయ్య అని సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి నరేంద్ర, సీనియర్ నాయకులు మద్దెల నాగయ్య అన్నారు. పోడు భూముల పోరాట యోధుడు మద్దెల నరసయ్య 20వ వర్ధంతి సభ బాజు మల్లయ్య గూడెం శాఖ కార్యదర్శి వల్లేబోయిన కొండలరావు అధ్యక్షతన జరుగగా వారు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రపంచంపై ఆయుధాలతో, టారిఫ్ వారు నడుపుతున్నాడని, ఇందులో భాగమే పాలిస్తే నాపై ఇజ్రాయిల్ యుద్ధం, రష్యా ఉక్రెయిన్ యుద్ధం అమెరికా ప్రోత్సాహంతో అండదండలతో జరుగుతున్నాయని ప్రపంచానికి అమెరికన్ సామ్రాజ్యవాదం పెట్టుబడి దారీ వ్యవస్థ వలన నష్టం జరుగుతుందని ఈ నష్టంలో కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు సమస్త ప్రజానీకం అనుభవిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన బీసీ బిల్లుకు మోకాలడ్డి అన్యాయం చేస్తుందని విమర్శించారు. బీసీ బిల్లు పేరుతో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపని కారణంగా స్థానిక పాలన కుంటుబడి గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందని అఖిలపక్షాలను కలుపుకొని బిసి బిల్లుకై కేంద్రంపై పోరాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ రేవంత్‌రెడ్డిపై ఉందన్నారు. లేని యెడల ప్రజలను సమీకరించి సిపిఎం పోరాడుతుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు యనమనగండ్ల రవిబాబు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు అజ్మీర శోభన్ బాబు, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు ధరావత్ వినోద్ కుమార్, పాటిమీద గుంపు శాఖ కార్యదర్శి సురభాక సర్వయ్య, పార్టీ సీనియర్ నాయకులు మన్నెం బ్రహ్మయ్య, రాచబంటి పుల్లయ్య, పోతురాజు, చంద్రరావు, చేరు వెంకటేశ్వర్లు, ఎస్కే చిన్న సైదులు, గోకినపల్లి భారత లక్ష్మి పాల్గొన్నారు.

# పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం : కోరం



**ప్రజాపక్షం/ఇల్లందు:** పేదలకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఎల్ఏ కోరం కనకయ్య అన్నారు. శనివారం కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసి ఆర్థిక ఊబిలోకి నెట్టి వేసిందని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆర్థిక వ్యవస్థను గాడినపెడుతూ సంక్షేమ పథకాలు అందచేస్తుందని, ఈ క్రమంలో కొంత సమయం పడుతున్నప్పటికీ ప్రతి పథకం అమలు చేస్తామని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పేదలు తమ ఆడ పిల్లలకు వివాహం జరిపించుకునేందుకు చేదోడు వాదోడుగా ఉండాలని కళ్యాణ లక్ష్మి, షాదీముబాకర్ పథకాల ద్వారా లబ్ధిదారులకు లక్ష పదహారు అందజేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కోట రవికుమార్, మార్కెటి ఛైర్మన్ రాంబాబు, డి ఎస్పి చంద్ర భాను, ఇల్లందు టౌన్, మండల పార్టీ అధ్యక్షులు దొడ్డా డానియల్, పులి సైదులు, ఇల్లందు మండల మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మాజీ మున్సిపల్ ఛైర్మన్ యదలపల్లి అనసూర్య, మడుగు సాంబమూర్తి, గందె సదానంద, మండల టౌన్, ప్రధాన కార్యదర్శి అరెం కిరణ్, సుదర్శన్, రాయల్ మున్నా, కోరీ, జాఫర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఈసం లక్ష్మణ్, నాయకులు పాయం క్రిష్ణ ప్రసాద్, ప్రసన్న కుమార్ యాదవ్, తాటి బిక్షం, తాటి రాంబాబు, కల్తీ పద్మ, పాయం స్వాతి, బానోత్ శారద, పాయం లలిత, మోకాళ్ళ వెంకటమ్మ, గాలి స్వరూపా, భూక్యా రమాదేవి, మండల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆదివాసీ నాగులమ్మ జాతర



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల పరిధిలోని గొందిగూడెం, సంద్రాల బోరు, అమెర్ద గ్రామాల్లో నాగుల చవితి సందర్భంగా ఆదివాసీల కుల దైవం అయిన నాగులమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు విచ్చేసి పూజలు నిర్వహించి, దీనిలో భాగంగా వారు నిర్వయించిన అన్నదాన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశ పార్యపరంగా వస్తున్నా ఆదివాసీ ఆచారాలను నిలబెట్టాలని మూలాలను మరవకూడదని తెలిపారు. కనుల పండుగగా జరిగిన నాగులమ్మ జాతరను నిర్వహించిన కమిటీలను అభినందించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భూరెడ్డి వెంకట్‌రెడ్డి, శర్పుద్దిన్, ఎనిక రవి, పాయం సర్వేశ్వరరావు, చుంచు ఏకాంబ్రం, తెల్లం వీరబద్రం, కాక రాములు, పాయం భద్రమ్మ, కొమరం చిట్టెమ్మ, రావులపల్లి నరసింహారావు, శశికాంత్, గొల్లపల్లి నరేష్, విజయ్, షారుక్ పాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ముగింపు సభ జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మంలో జరుగు సిపిఐ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని వైరా పట్టణంలో పలువురిని కలిసి డిసెంబర్ 26 వ తారీఖున సా యంత్రం ఖమ్మంలో లక్షల మందితో భారీ ఎత్తున భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడుతున్నాయని ఈ ఉత్సవాలను వైరా పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు విపరీతంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి యామాల గోపాలరావు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వైరా సిఐగా ఎల్లావుల వెంకటప్రసాద్

**ప్రజాపక్షం/వైరా:** వైరా సిఐగా ఎల్లావుల వెంకటప్రసాద్ రానున్నారు. ఇప్పటివరకు వైరాలో సిఐగా బాధ్యతలు నిర్వహించిన నునావత్ సాగర్ బదిలీపై కారేపల్లి వెళుతున్నారు. ఎల్లావుల వెంకటప్రసాద్ సుమారు నాలుగు సంవత్సరాల పైన ఇంటిలిజెన్స్ విభాగంలో పనిచేశారు.

# బోళ్ల గంగారావుకి సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన బోళ్ల గంగారావుని వైరా మున్సిపాలిటీ 2వ వార్డు తిరుపతి శ్రీను బోళ్ల గంగారావుని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓర్సు నారాయణ, తురక ఆంజనేయులు, ఓర్సు గోపాల్, బండారు వెంకటేశ్వర్లు, వల్లెపు రాంబాబు, ఓర్సు శ్రీను, దేవుళ్ల శ్రీరాములు, వేముల శ్రీనివాసరావు, వల్లెపు నర్సింహారావు, వల్లెపు శ్రీను, దేవుళ్ల కృష్ణ, ఓర్సు రాజు, తమ్మిశెట్టి శ్రీను, బత్తుల నాని, హనుమాన్ బజార్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

# రీమా రోష్ని వృద్ధాశ్రమంలో పుట్టిన రోజు వేడుకలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా తమ పుట్టిన రోజు వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. తన పుట్టిన రోజును దైవ సమానులైన వృద్ధుల మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని, శనివారం ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేసి నూతన వస్త్రాలు, స్వీట్స్ అందించారు. వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి, వృద్ధులతో కలిసి భోజనం చేశారు. తన చిన్నతనం నుండి పెద్దలన్న వృద్ధులన్న చాలా గౌరవమని వారిని చూస్తూ ఉంటే మనసు చలిస్తుందని, మానవత్వాన్ని మరిచిన కన్న బిడ్డలు తల్లిదండ్రులను అనాథలుగా వదిలిపెడుతున్నారని వారు లేనిదే మనము లేమని మనసులోని భావనాన్ని వ్యక్తపరిచారు. ఇంత మంది వృద్ధేలను చేరదీసి వారికి సకల సౌకర్యాలు అందిస్తు కష్ట సుఖాలను ఓర్చుకొని ఎంతో ఓపికతో ఆశ్రమ నిర్వహణాన్ని నడుపుతున్న వృద్ధాశ్రమ నిర్వాహకురాలని అభినందించారు. ఈరోజును తన జీవితంలో మర్చిపోలేనని అన్నారు. ఈకార్యక్రమంలో స్వర్ణాలత లెనినా ప్రభాకర్‌రావు దంపతులు మౌనిక ధనుంజయ, జైపాల్ ముఖర్జీ ఆశిష్ శ్రమ నిర్వాహకులు షహనాజ్ బేగం మెహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నివారణకై ఇల్లందులో సైకిల్ ర్యాలీ



**ప్రజాపక్షం/ఇల్లందు:** డ్రగ్స్ నివారణకై పోలీస్ శాఖ చేపట్టిన చైతన్య యుద్ధంలో భాగంగా విద్యార్థులతో ఇల్లందు పట్టణంలో శనివారం పోలీసులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని జగదాంబ సెంటర్ నుండి కొత్త బస్టాండ్ మీదుగా విద్యార్థులు పోలీసులు డ్రగ్స్ సేవించడం విక్రయించడం చట్ట రీత్యా నేరం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ర్యాలీలో ఇల్లందు డిఎస్పి చంద్రబాను, సిఐ తాటిపాముల సురేష్, ఎస్ఐలు సూర్య, హసీనా, విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ విద్యార్థులు యువత డ్రగ్స్ నివారణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని విజ్ఞప్తి చేశారు. యువత విద్యార్థులు డ్రగ్స్‌పై చుట్టు పక్కల ప్రజలకు అవగాహన కల్పించి డ్రగ్స్ రహిత తెలంగాణకు కృషి చేయాలని సూచించారు.

# పోడు భూముల్లో ఫారెస్ట్ అధికారుల సర్వే

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలో గత వారం రోజులుగా మండల పరిధిలో ఉన్నటువంటి పోడు భూమి సాగు రైతుల భూములను ఫారెస్ట్ అధికారులు వివరణ స్పష్టత లేని సర్వేలు నిర్వహించి సాగు పోడు భూమి రైతులను అయోమయంలో పడేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోడి అమరేందర్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేసీఆర్ ఇచ్చిన పట్టాలను రద్దు చేయడానికి సర్వే నిర్వహిస్తున్నారా లేదా మిగిలిన అరాకొర పోడు రైతులకు పట్టాలు ఇవ్వడానికి సర్వే నిర్వహిస్తున్నారా అనే స్పష్టతను రాష్ట్ర ప్రభుత్వం, ఫారెస్ట్ అధికారులు వివరణ ఇవ్వాలని ప్రధాన ప్రతిపక్ష హోదాలో డిమాండ్ చేస్తున్నామని అన్నారు.